అంజనం

జె.యు.బి.వి. ప్రసాద్



స్కూలునించి ఇంటికి రాగానే పుస్తకాలు టేబుల్ మీద పడేసి, జేబు తడుముకున్నాను.

అంతే! గుండె ఝుల్లుమంది!

జేబులో పెన్నులేదు. నాన్న కొత్త పెన్ను కొనిచ్చి వారం కూడా కాలేదు. స్కూలు నించి ఇంటికొచ్చే దారిలో ఏమన్నా పడిపోయిందేమో! నాకు తరుచూ పుస్తకాలు పోవడమో, పెన్నులు పోవడమో జరుగుతూ వుంటుంది. భగవంతుడి దయ వల్ల కొన్ని దొరుకుతూ వుంటాయి, నా పాప కర్మ వల్ల కొన్ని దొరకవు.

''యేడో క్లాసులోకి వచ్చావు! అంత బాధ్యత లేకుండా వస్తువులు పారేసుకుంటావేమిటి?'' అని అమ్మ తిడుతూనే వుంటుంది.

నాకు బాధ్యత లేదా!? ఎప్పటికప్పుడు సామాన్లుచెక్ చేసుకుంటూనే వుంటాను. అయినా దేముడి దయలేక ఒక్కోసారి పోతూ వుంటాయి.

వెంటనే వంటిట్లో దేముడి పూజామందిరం దగ్గరికి వెళ్లాను.

''దేముడా, నాపెన్ను నాకు దొరికేటట్టు చూడు. దొరగ్గానే నీకు కొబ్బరికాయ కొడతాను'' అని భక్తిగా మొక్కుకున్నాను.

పెన్ను దొరుకుతుందనే నమ్మకంతో స్కూలుకెళ్లే దారంతా జాగ్రత్తగా చూసుకుంటూ వెళ్లాను. ఎక్కడా కనబడలేదు.

నాకింకో ధర్మసందేహం పట్టుకుంది.

పెన్ను దొరకలేదు కదా, అయినా కొబ్బరికాయ కొట్టాలా?

అయినా దేముడికి ఒకసారి మొక్కుకున్నాక, పెన్ను దొరకలేదని మొక్కు తీర్చకపోతే, కొత్త పాపం చుట్టుకుంటుందేమోనన్న భయం ఇంకొకటి.

మొక్కు తీర్చడానికే నిశ్చయించుకున్నాను. కాళ్లూ, చేతులూ కడుక్కుని, బట్టలు మార్చుకున్నాను.

వంటింట్లోంచి ఒక కొబ్బరికాయ తీసుకున్నాను.

''ఎందుకురా ఈవేళప్పుడు కొబ్బరికాయ కొడుతున్నావు దేముడికి?'' అనుమానంగా అడిగింది అమ్మ.

బెరుగ్గానే జరిగినదంతా చెప్పాను. అమ్మకి కోపం వచ్చేసింది.

''పోయిన పెన్నుకి ఈ కొబ్బరికాయ వట్టమా? నీకెప్పుడు జాగ్రత్త తెలిసేడుస్తుందీ?'' అంటూ తిట్ల తలంటి పోసింది.

''దేముడా! కొబ్బరి కాయ కొట్టలేదని నామీద కోపగించుకోవద్దు. రేపు శనివారం తప్పకుండా కఠిన వుపవాసం వుంటాను. నాకేమీ కష్టాలు రాకుండా చూడు తండ్రీ!'' అని కొత్తమొక్కు మొక్కుకున్నాను.

అమ్మ చిరునవ్వుతో నావేపు ముచ్చటగా చూస్తోంది. అమ్మ ఇంచక్కా నా భక్తి అర్థం చేసుకుంటుంది. నాకున్న గొడవ అంతా మా అక్కవల్లే. నన్నెప్పుడూ ''పిచ్చిభక్తి'' అని వెక్కిరిస్తూ వుంటుంది.

''ఏరా? మళ్లీ ఏం మొక్కుకుంటున్నావూ?'' అంటూ నవ్వుతూ అటువేపు వచ్చింది అక్క.

నేను రుస రుసా అక్కవేపు చూసి అక్కడినించీ వెళ్లిపోయాను.

మర్నాడు పొద్దున్న తలస్నానంచేసి, తడి తుండు గుడ్డ చుట్టుకుని వంటింట్లోకి వెళ్లేసరికి, అక్కడ కంచంలో చద్దన్నం, ఆవకాయా, పక్కనే రాచ్చిప్ప గిన్నెలో గడ్డపెరుగూ కనబడ్డాయి. నోట్లో నీళ్లూ రాయి.

మనసుని నిగ్రహించుకుంటూ దేముడి దగ్గరకి వెళ్లి దణ్ణం పెట్టుకున్నాను.

అమ్మకేదో అనుమానం వచ్చింది నా తడిబట్ట చూసి. నా వేపు ప్రశ్నర్థాకంగా చూసింది.

''తఇవాళ నేను కఠిన వుపవాసం. రాత్రి వరకూ

ఏమీ తినను. రాత్రి వుప్పిడి పిండి తింటాను’’ అన్నాను నెమ్మదిగా.

‘‘మర పట్టించిన బియ్యం మొరెం లేదు ఇంట్లో. ఇప్పుడు నీకోసం బియ్యం మొరంగా విసరాలి తిరగలి మీద. పోనీ వచ్చే శనివారం వుండకూడదూ నీ వుపోషం?’’ అని అడిగింది అమ్మ.

అలా అంటున్నది అమ్మేనా, లేక మారువేషంలో నన్ను పరీక్షచేస్తున్న దేముడా అని పట్టి పట్టి అమ్మను చూశాను. అనుమానం లేదు! అమ్మే!

‘‘వీడికప్పుడే పిచ్చి వాలకం వచ్చేసింది ఈ పిచ్చి భక్తితో!’’ అంది అక్క ఆవకాయ ముక్క పెరుగున్నంలో నంచుకుంటూ.

అక్కమీద వచ్చిన కోపం, కంచంలోని తెల్లటి పెరుగన్నం, ఎర్రటావకాయా చూడగానే గప్పున చల్లారిపోయింది.

‘‘లేదు లేవే! నేనివాళే వుండాలి వుపోషం!’’ అంటూ వంటింట్లోంచి బయటకి నడిచాను. అక్క కంచం వేపు చూడకుండా జాగ్రత్తపడుతూ.

ఆ రోజు స్కూల్లో నాకు కష్టాలు మొదలయ్యాయి.

రోజూ కొనుక్కున్న చిరుతిళ్లని కాస్త పెట్టండ్రా అని ఎంత బతిమాలినా పెట్టని స్నేహితలు, ఆ రోజు అడక్కుండానే వాళ్ల చిరుతిళ్లు కాసింత పెట్టారు. అవి తినకుండా నిగ్రహించుకోడానికి ఎంతో శక్తి కూడదీసుకోవాల్సి వచ్చింది. అవొద్దనడానికి మనసొప్ప లేదు. అందుకని వాళ్లు పెట్టివన్నీ తీసుకుని, కాగితంలో పొట్లం కట్టుకున్నాను.

> ‘‘ఆవిడే! ఆవిడే! అప్పుడే వెంకటేశ్వర స్వామి పూనేశాడు. ఇప్పుడావిడ చిన్న సూరీ వాళ్ల మేనత్త కాదు, వెంకటేశ్వర స్వామి’’ అంటూ రాముా భక్తిగా ఆవిడకి దణ్ణం పెట్టాడు.

‘‘ఏంట్రా, పొట్లాలు కడుతున్నావు కిరాణా కొట్లో లాగా?’’ ఒకడడిగాడు.

‘‘ఇవాళ నాకు శనివారం!’’ కాస్త అతిశయంగా అన్నాను.

‘‘నీకే కాదురా మాకూ ఇవాళ శనివారమే! మనకే కాదు ప్రపంచంలో అందరికీ శనివారమే! అయితే ఏవిట్రా?’’ ఇంకొకడు కిసుక్కున నవ్వి అడిగాడు.

‘‘ప్రపంచంలో అందరికీ శనివారం కాదురా! భూమికి అటువేపున వుండే వాళ్లకి ఇంకా శుక్రవారమే!’’ అన్నాడు సోడబుడ్డి కళ్లద్దాలాడు.

వాడికి ఎప్పుడూ సోషల్లో ఫస్టుమార్కే! అదీ వాడి గొప్ప!

‘‘అబ్బ, ఆపండ్రా మీ గోల! నేనివాళ శనివారం కఠిన వుపవాసం వుంటున్నాను. రాత్రి వరకూ అన్నం గానీ, వేరేవి గానీ తినను. రాత్రి వుప్పుడి పిండి తింటాను మడి కట్టుకుని’’ వివరంగా చెప్పాను వాళ్లకి.

వాళ్లు నావేపు అబ్బురంగా, ఆరాధనగా చూశారు.

‘‘మరి ఈ పొట్లాలెందుకూ?’’ ఒక అనుమానపృక్షి ఆ పొట్లాలు వాడి కిచ్చేస్తానేమననే ఆశతో అడిగాడు.

‘‘రాత్రి వుప్పుడు పిండి మడి కట్టుకుని తిన్నాక, ఇంకేమన్నా తినొచ్చు. మా అమ్మచెప్పింది. తప్పులేదుట’’ వాళ్లందరికీ వుపవాస సారాంశం విడమర్చాను.

అందరూ నావేపు ఒక పెద్ద భక్తుడిని చూసినట్టు చూశారు.

ఆ చూపుల కోసం ఎన్ని శనివారాలన్నా వుపోషం వుండగలననే మానసిక బలం వచ్చింది.

పిల్లలు కేరేజీలు తెరిచి తిళ్లు తింటూ వుంటే, నామీద నాకే ఎంతో జాలి వేసింది. తిండి తిని ఎన్నో రోజులయినట్టూ, అన్నానికి మొహం వాచిపోయినట్టూ అనిపించింది.

మొత్తానికి అలా ఒక గంట కష్టపడ్డాక, మధ్యాహ్నం క్లాసులు మొదలయ్యాయి. ‘అమ్మయ్య’ అనుకుని క్లాసు హడావుడిలో పడిపోయాను.

ఇంటికెళ్లినప్పటి నుంచీ, ‘‘అమ్మా, చీకటి పడిందా, చీకటి పడిందా?’’ అని అమ్మని తెగ కాల్చుకు తిన్నాను.

‘‘నక్షత్రం వచ్చిందేమో చూడు. అదొస్తే రాత్రయినట్టే’’ అమ్మ వుపాయం చెప్పింది.

‘‘నక్షత్రాన్ని చూసేది కార్తీక సోమవారానికి కదమ్మా? మరి శనివారం చెబుతావేం?’’ అర్థంగానట్టు అడిగాడు.

‘‘నక్షత్రం చూసేది కార్తీక సోమవారం వుపవాసానికే అయినా, నక్షత్రం వస్తే రాత్రి అయినట్టే కదరా!’’ అమ్మ చెప్పింది.

నీరసంగా వున్న నాకు ఆకాశంలో చాలా నక్షత్రాలు కనిపించాయి. మళ్లీ పట్టి పట్టి చూస్తే ఏమీ లేవు.

ఏమయితేనేం, ఆఖరికి చుక్కపొడిచింది. సాక్ష్యానికి అక్కని కూడా పిలిచి నక్షత్రాన్ని చూపించాను.

‘‘కనపడిందిరా నక్షత్రం. రాత్రి అయినట్టే. పోయి పిండితిను’’ అంది అక్కజాలిగా.

చొక్కా, లాగూ విప్పి, అమ్మ వేరేగా అట్టిపెట్టిన మడి బట్టలు కట్టుకున్నాను. భక్తిగా దేముడికి దణ్ణం పెట్టుకున్నాను. ఆ తర్వాత ఆవురావురుమంటూ వుప్పుడుపిండి, దోసకాయపప్పూ, వంకాయకూరా, కొబ్బరికాయ పచ్చడీ, పెరుగూ వేసుకుని తిన్నాను. ఆకలి మీదున్నానేమో చాలా రుచిగా వున్నాయన్నీ. పొట్ట పగిలేలా తిన్నాను.

‘‘అమ్మయ్య, శనివారం వుపోష ఫలితం వచ్చేసింది. అన్ని అరిష్టాలూ తొలిగిపోతాయి’’ అని గాఢంగా నిట్టూర్చాను.

రాత్రి అరుగు మీద కూర్చుని, కాళ్లూపుకుంటూ, మధ్యాహ్నం స్కూల్లో పొట్లాలు కట్టుకున్న చిరుతిళ్లు నెమ్మదిగా నమలడం మొదలుపెట్టాను.

పక్కింట్లోంచి రాముా వచ్చాడు బయటకి. వాడు మా స్కూల్లోనే నాకన్నా రెండు క్లాసులెక్కువ.

‘‘నేనివాళ శనివారం కఠినవుపోషం వున్నాను, తెలుసా?’’ గొప్పగా అన్నాను.

‘‘అది సరేలేగానీ, పక్క సందులో చిన్నసూరీ వాళ్ల మేనత్తకి ప్రతి శనివారం వెంకటేశ్వర స్వామి పూనుతాడుట. నేనక్కడికే వెళుతున్నాను చూడటానికి. నువ్వూ వొస్తావా?’’ అడిగాడు రాముా.

‘‘చిన్నసూరీ వాళ్లు కాపులు కదా? కాపులకి కూడా దేముడు పూనుతాడా?’’ ఆశ్చర్యంగా అడిగాను.

‘‘అవేమీ నాకు తెలియవు గానీ, ఇంతకీ నువ్వొస్తావా, రావా?’’ అడిగాడు ఆలస్యం అయిపోతోందన్న విసుగుతో.

‘‘సరే, సరే’’ అని వొప్పేసుకుని, ‘‘అమ్మా నేను పక్కసందు చిన్న సూరీ వాళ్లింటికి వెళ్తున్నానే’’ అని ఇంట్లోకి ఒక కేకెట్టి, రాముాతో కలిసి పరిగెట్టుకుంటూ, పక్క సందు చివర్లో వున్న చిన్నసూరీ వాళ్లింటికి వెళ్లాను.

మేము వెళ్లేసరికి వాళ్లింటి ముందర ఒక కొత్త లారీ ఆగి వుంది. వాడి మేనత్త ఆ లారీకి పూజ చేస్తోంది. ఆవిడ మొహం అంతా పసుపు రాసుకుంది. రూపాయి కాసంత కుంకం బొట్టు పెట్టుకుంది. పసుపు పచ్చ పట్టుచీర కట్టుకుంది. మొహం చాలా తీక్షణంగా వుంది. ఆవిడ అసలేమీ మాట్లాడకుండా, లారీకి పసుపు, కుంకాలు బొట్టుపెట్టి, కొబ్బరికాయ కొట్టింది.

‘‘ఆవిడే! ఆవిడే! అప్పుడే వెంకటేశ్వర స్వామి పూనేశాడు. ఇప్పుడావిడ చిన్నసూరీ వాళ్ల మేనత్త కాదు, వెంకటేశ్వరస్వామి’’ అంటూ రాముా భక్తిగా ఆవిడకి దణ్ణం పెట్టాడు.

నేను కూడా ఆవిడ వేపు భక్తిగా చూసి, దణ్ణం పెట్టుకున్నాను.

ఇంతలో మమ్మల్ని చూసి చిన్నసూరి మా దగ్గరకి వచ్చాడు.

‘‘ఇవాళ మానాన్న కొత్త లారీ కొన్నాడు. స్వామి ఆ లారీకి పూజ చేస్తున్నారు’’ చెప్పాడు మాకు అర్థం అయ్యేటట్టు.

పూజ ముగించి స్వామి ఇంట్లోకి నడిచారు. వెనకాలే మేమూ వినయంగా వెళ్లాం. వసారాలా కూర్చున్నాం.

అక్కడున్న వారిలో ఒక పెద్దావిడ, ‘‘స్వామీ! మా ఇల్లు వ్యాజ్యంలో వుంది. మేం గెలుస్తామంటారా?’’ అని విధేయంగా ప్రశ్న అడిగింది.

నాకు అర్థం గాక, చిన్నసూరి వేపు చూశాను. వాడు నా చెవిలో గుడగుళ్లాడాడు.

‘‘స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులు స్వామిని ప్రశ్నలు అడగొచ్చు. ఇష్టమైతే స్వామి సమాధానం చెబుతారు’’ అన్నాడు వాడు.

‘‘నేను కూడా ప్రశ్న అడగొచ్చునా?’’ అని చిన్నసూరి చెవిలో గుసగుసగా అడిగాను.

నేను రెండు వారాల కిందటే హిందీ రాష్ట్ర భాష పరీక్ష రాశాను. ప్రాథమికలో ఫస్ట్ క్లాసు వచ్చింది. మాధ్యమికలో రాలేదు. రాష్ట్రభాషలో అయినా ఫస్ట్ క్లాసు వస్తుందేమోనన్న ఆశ. ఆ ప్రశ్నదేముడినడగాలని నా తాపత్రయం.

''ఇదివరలో అందరూ వుత్తినే అడిగే వాళ్లు ప్రశ్నలు. అలా అడిగే వాళ్లు ఎక్కువైపోయారని, ఒక ప్రశ్న అడగాలంటే ముప్పావలా హుండీలో వెయ్యాలని రూలు పెట్టేము'' చెప్పాడు చిన్నసూరి.

ముప్పావలా? అన్ని డబ్బులు నాకెక్కడివీ? ప్రశ్న అడగాలనే ఆశ వదిలేసుకుని, భక్తిగా స్వామినే చూస్తూ కూర్చున్నాను.

చిన్నసూరి నన్నూ, రామూనీ బయటకి రమ్మని సైగ చేశాడు. మేమిద్దరం స్వామి కాళ్లకి నమస్కారం చేసి బయటకి నడిచాం.

''స్వామి ఇవాళ జ్యోతి చూపిస్తారు. మీరిద్దరూ కావాలంటే చూడొచ్చు'' అన్నాడు చిన్నసూరి.

వాడి మాటలేవీ నాకర్థం కాలేదు. అదే అన్నాను వాడితో.

''మా ఇంట్లో పూజగది పక్కన ఒక చిన్న గదుంది. ఆ గదిలో ఒక చిన్న గూడుంది. ఆ గూటికి ఒక తెల్లగుడ్డ పరదాలా కట్టాం.

భక్తులందరూ ఆ గదిలోకి వెళ్లగానే తలుపులు మూసేస్తాం. లోపలంతా చీకటిగా వుంటుంది. భక్తులందరూ ''గోవిందా, గోవిందా'' అంటూ భజన చేస్తారు. అప్పుడు స్వామి మహిమ వల్ల ఆ చీకట్లో తెర మీద చిన్నజ్యోతి కనబడుతుంది భక్తులకి. ఎక్కువ మంది వచ్చేస్తారనీ, చోటు చాలదనీ ఎవరికీ చెప్పం. మీరు నా బళ్లో చదివే వాళ్లని చెబుతున్నాను'' అని వివరించాడు వాడు.

ఆశ్చర్యంతోటీ, ఆనందంతోటీ నా కళ్లు పెద్దవయ్యాయి. చిన్నసూరి చదివే బళ్లో చదవడం నా భాగ్యం అని అర్థం అయింది.

కానీ చిన్ని అనుమానం వచ్చింది.

''మరి దీనికేవన్నా డబ్బులు కట్టాలా?'' భయం, భయంగా అడిగాను.

''అబ్బే, ఇది ఫ్రీ! దీనికి డబ్బులక్కర్లేదు. అయితే చాలా భక్తిగా, గట్టిగా భజన చేయాలి. లేకపోతే జ్యోతి కనిపించదు.''

చిన్నసూరి నాకంటికి ఓ చిన్న సైజు దేవుడిలా కనబడ్డాడు. వాడే నాకన్ని వరాలు ఇచ్చేస్తున్నాడు.

వాడు మా ఇద్దర్నీ వేరే గదిలోంచి ఇంకో చిన్న గదికి తీసుకెళ్లాడు. కళ్లు చీకటికి అలవాటు పడేసరికి కాస్త టైం పట్టింది. ఇద్దరు, ముగ్గురు తప్పితే అందరూ పిల్లల్లాగే కనబడ్డారు ఆ చీకట్లో. దూరంగా గోడా, దానిమీద నేలకి దగ్గరగా ఒక గూడూ, ఆ గూటికొక తెల్లపరదా, ఆ గూటి పక్కనే ఒక అగరు బత్తి వెలిగించి పెట్టారు.

స్వామి కూడా వచ్చి మాతో కూర్చునే వరకూ భజన మొదలుపెట్టలేదు. తలుపులు మూసేశాక పక్కనున్న వాళ్లు కూడా కనిపించలేదు. అందరం ''గోవిందా, గోవిందా'' అంటూ భజనం చేయడం మొదలుపెట్టాం. ఎంత గట్టిగా భజనచేస్తే, అంత భక్తి వున్నట్టు గ్రహించుకున్నాను. శరీరం అంతా భక్తితో కంపిస్తూ వుండగా గొంతెత్తి బిగ్గరగా, ''గోవిందా, గోవిందా'' అంట భజన చెయ్యసాగాను. ఒళ్లంతా చెమటలు పట్టాయి. కళ్లు తీక్షణంగా గూటి మీద వున్న తెరనే చూస్తున్నాయి. రెప్పలార్పినప్పుడల్లా జ్యోతి వచ్చి వెళ్లిపోతుందోమోనన్న భయం. ఎక్కువ భక్తితో గట్టిగా భజన చెయ్యకపోతే పాపం చేసుకున్న వాడిగా జ్యోతి కనబడదేమోనని పెద్ద భయం.

అంతలో ఎవరో, ''అదిగో జ్యోతి'' అని అరిచారు.

''అదిగో, అదిగో జ్యోతి, గోవిందా, గోవిందా'' అంటూ చాలామంది గట్టిగా, భక్తితో ప్రకంపిస్తూ అన్నారు.

కళ్లు చిట్లించుకుని చూశాను. నాకేమీ కనబడలేదు.

ఈసారి భయంతో చెమటలు పోశాయి. నేను నిజంగా పాపాత్ముడినే అని నిర్ధారణ అయిపోయింది. చాలా బాధ కలిగింది.

ఒకసారి కళ్లు మూసుకుని దేముడిని గట్టిగా ప్రార్థించుకున్నాను. ఇంకా గట్టిగా, ''గోవిందా, గోవిందా'' అని అనసాగాను ఎక్కువ భక్తితో.


వేకువజామున... అరగంటాలస్యంగా కూత కూస్తోంది! సరిచెయ్యాలిసార్!!
అన్ని రకముల గడియారములు అలారం టైంపీసులు రిపేరు చేయబడును

ఇంతలో పక్కనున్న రామూ, ''అదిగో జ్యోతి, గోవిందా, గోవిందా'' అంటూ సంతోషంగా అరవసాగాడు.

నేను కూడా, ''అదిగో జ్యోతి, అదిగో జ్యోతి, గోవిందా, గోవిందా'' అంటూ గట్టిగా కేకలు పెట్టాను.

భక్తులందరూ ఇంకొంచెం సేపు భజన చేసి ఆపారు. బయటకి వచ్చేసరికి చొక్కా చెమటకి తడిసిపోయి వంటికి అంటుకుపోయింది.

చల్లగాలి వంటికి తగిలి కాస్త సేద తీరింది. కానీ మనసులో ఏదో మూల కాస్త బాధగానే వుంది.

''మీరిద్దరూ చాలా గట్టిగా భజన చేశారు. మీరే అసలైన భక్తులు'' అని చిన్నసూరి రామూనీ, నన్నూ మెచ్చుకున్నాడు.

సంతోషంతో మా మొహాలు వికసించాయి. ఇంటిదారి పట్టాం. దారంతా దిగులుగానే వుంది మనసులో. నేనీ మధ్య ఎక్కువగా పుణ్యాలు చేసుకుంటున్నట్టు లేదు. పాపాలే ఎక్కువ చేస్తున్నట్టున్నాను. సినిమాలుచూడటం తగ్గించెయ్యాలనీ, అక్కతో కొట్టాడ్డం మానెయ్యాలనీ, కోమటితో ఇవాళా పేకాట ఆడకూడదనీ నిశ్చయించుకున్నాను.

అయినా మనసుకి వూరట కలగలేదు.

గడుస్తున్న రోజులతో పాటు నా భక్తీ, వుపోషాలూ పెరుగుతూనే వున్నాయి.

మా క్లాసులో కొంతమంది నాకేవో శక్తులున్నాయనీ, నేను శాపాలు ఇవ్వగలననీ నమ్మేవారు. నేను కూడా ఒకరిద్దరికి వుత్సాహంగా శాపాలిద్దామనుకున్నాను. గానీ, అలా శాపాలిస్తే వాళ్లింక నాతో సావాసం చేయమని బెదిరించడంతో, ఆ ప్రయత్నం వదులుకున్నాను. ఎప్పుడో ఏదో పెద్ద సందర్భం వస్తుందనీ, ఎవరికో పెద్ద శాపం ఇచ్చేయచ్చనీ ఆశ నాకు. కానీ అలాంటి అవకాశం నాకెప్పుడూ రాలేదు.

ఏదో పండగ రాబోతోంది. కొన్ని వారాల్లో. నాన్న, ఇంట్లో అందరికీ కొత్త గుడ్డలు కొన్నాడు. ఇంట్లో అందరం సంతోషంగా మా ఆది బట్టలతో పాటు కొత్త గుడ్డలన్నీ టైలరు సాయిబుకి ఇచ్చాం.

నాలగు రోజుల తర్వాత ''మీ బట్టల పని అయిపోయింది. రాత్రి మీనాన్నకిచ్చి పప్పుతాను'' అని చెప్పాడు సాయిబు.

రాత్రి నాన్న వచ్చేసరికి నేను నిద్రపోతాను కాబట్టి, పొద్దున్నే లేచి కొత్తబట్టలు చూసుకోవాలని నిశ్చయించుకున్నాను.

పొద్దునే నిద్రలేచేసరికి అమ్మా, నాన్నా, అక్కా ఆ బట్టలు ముందరేసుకుని విచారంగా కనబడ్డారు.

''ఏమయిందే?'' అనడిగాను అక్కని.

''కొన్ని కొత్త బట్టలు పోయాయి. నా కొత్త పట్టు పరికిణీ, కొత్త పట్టుజాకెట్టూ, అమ్మ కొత్త పట్టుజాకెట్టూ, నీ టెరీకాటన్ చొక్కా, నాన్న టెర్లిన్ చొక్కా లేవు సాయిబిచ్చిన బట్టల్లో. ఆదికిచ్చిన బట్టలు మాత్రం వున్నాయి'' చెప్పింది విచారంగా.

''దానికి విచారం ఎందరూ? సాయిబు మర్చిపోయి వుంటాడూ! కొట్టు తెరవగానే నేవెళ్లి తీసుకొస్తాగా!'' ధైర్యంగా అన్నాను.

''పొద్దున్నే నాన్న సాయిబింటికి వెళ్లి, నిద్రలేపి

విషయం చెప్పాడు. సాయిబు బట్టలన్నీ ఇచ్చేశానం టున్నాడు. కుట్టు కూలీ ఇచ్చాక ఆ బట్టలన్నీ నాన్న సైకిలు వెనకాల కేరేజీ మీద పెట్టుకున్నాడు. అక్కడే చెక్ చెయ్యలేదు. నాన్న, సాయిబూ కలిసి కొట్టు తీసి వెతికారు. దొరకలేదు. అవి పోయినట్టే!'' చెప్పింది అక్క ఎంతో దిగులుగా.

నా గుండెల్లో పెద్ద రాయి పడింది. ఏడుపు మొహం పెట్టుకుని చూశాను అమ్మవేపు.

''అమ్మా! మరెలాగే పండక్కి కొత్త బట్టలు?'' దిగులుగా అడిగాను.

''ఏమీ ఫరవాలేదురా! దేముడు లేడూ మన పట్లా! పోయిన వస్తువులు తప్పకుండా దొరుకుతాయి మనకి. గాంగేయుల వారిని ప్రశ్న అడుగుదాం'' అంది అమ్మ ఎంతో నమ్మకంగా.

గాంగేయుల వారు పంచాంగాలు రాస్తారు. అన్ని శుభకార్యాలకి ముహూర్తాలు పెడతారు. అందరికీ జాతక చక్రాలు కూడా వేస్తారు. ఎవరైనా ఏదైనా సమస్య వచ్చి, దాని గురించి ప్రశ్న అడిగితే, ఏవేవో చక్రాలూ, గళ్లూ వేసి జవాబు చెబుతారు.

దేముడి మీదే భారం వేసి అమ్మతో నేనూ గాంగేయుల వారింటికి వెళ్లాను. చిన్న పురోహితుడు మా దగ్గరకి వచ్చాడు. అమ్మ విషయం అంతా వివరించింది.

''ప్రశ్న అడగడానికి రూపాయి పావలా అవుతుందమ్మా!'' అన్నాడాయన.

అమ్మ ఏమీ మాట్లాడకుండా ఆయన చేతిలో డబ్బు పెట్టింది. ఆయన లోపలకి వెళ్లి ఒక పావు గంట తర్వాత మా దగ్గరికి వచ్చాడు. ఆయన చేతిలో ఏదో కాగితమూ, ఆ కాగితం మీద ఏవో చక్రాలూ, గళ్లూ, అక్షరాలూ వున్నాయి.

''అన్ని గ్రహాలూ వేసి చూశామమ్మా. మీరు పోగొట్టుకున్న వస్తువులు మీకు తిరిగి దొరకవు'' అన్నాడాయన.

''అమ్మా! ఆ సాయిబే మన బట్టలు కాజేశాడా?'' నీరసంగా అడిగాను.

''ఆ సాయిబు ఎన్నో ఏళ్లనించీ మనకి బట్టలు కుడుతున్నాడు. ఆ మనిషి ఇలా చేస్తాడంటే నమ్మశక్యంగా లేదు. ఎవరికే బుద్ధి ఎప్పుడెలా పుడుతుందో! మొన్న పక్కింట్లో వాళ్లు అంజనం వేయించారుట. వాళ్లకేవో పోయిన వస్తువులు దొరికాయిట. మనం కూడా అంజనం వేయిద్దాం. ఏ పుట్టలో ఏ మహిముందో!'' ఆశగా అంది అమ్మ.

మళ్లీ కొత్త ఆశ చిగురించింది. ఈసారి దేముడు తప్పక సాయం చేస్తాడని విశ్వాసం కలిగింది.

మా సందులో ఒక స్కూలు టీచరున్నాడు. ఆయన ఆంజనేయ వుపాసకుడు. ఆయన శాస్త్రోక్తంగా, నిష్టంగా పూజ చేయించి, చేతిలో ఏదో నల్లరంగు పదార్థంతో అంజనం వేస్తాడు. ఆ అంజనంలో ఆంజనేయస్వామి కనబడి, జరిగినవీ, జరగబోయేవి చూపిస్తాడు. ఈ అంజనం మగ పిల్లల చేతుల్లోనే వేస్తారు.

మా సందులో ఒక స్కూలు టీచరున్నాడు. ఆయన ఆంజనేయ వుపాసకుడు. ఆయన శాస్త్రోక్తంగా, నిష్టంగా పూజ చేయించి, చేతిలో ఏదో నల్లరంగు పదార్థంతో అంజనం వేస్తాడు. ఆ అంజనంలో ఆంజనేయ స్వామి కనబడి, జరిగినవీ, జరగబోయేవి చూపిస్తాడు. ఈ అంజనం మగ పిల్లల చేతుల్లోనే వేస్తారు.

మగపిల్లాడిలా పుట్టినందుకు గర్వించాను.

ఆరోజే అమ్మ ఆంజనేయోపాసకుడితో మాట్లాడింది. అన్ని ఏర్పాట్లూ మొదలయ్యాయి.

పొద్దున్నే తలస్నానం చేసి, మడి కట్టుకున్న నాతో నిష్టగా ఆంజనేయ స్వామి పూజ చేయించారు. చేతికి ఏదో వ్రతమాల కట్టారు. సాయంకాలం వరకూ కఠిన వుపవాసం. సాయంకాలం మళ్లీ నాచేత పెద్ద పూజ చేయించారు. చాలా వుత్కంఠగా వుంది నాకు. ఈ కార్యక్రమం చూడ్డానికి పక్క ఇళ్లల్లో వాళ్లు చాలా మందే వచ్చారు.

ఆంజనేయస్వామి కనబడితే నా జన్మ ధన్యమయినట్టే. అప్పటికే నా మీద బోలెడు గౌరవం పెట్టుకున్న నా స్నేహితులు ఈ అంజనం విషయం తెలిసి నన్నొక చిన్న దేవుడిలా చూసేవారు.

పొద్దున్నించీ తిండి తినక పోవడం వల్ల కాస్తనీరసంగా వుంది. అయినప్పటికీ ఆంజనేయస్వామిని చూస్తాననే విషయం చాలా బలం ఇచ్చింది.

వుపాసకుడు నా కుడిచేతికి ఏదో నల్లటి పదార్థం రాశారు. చుట్టూ వున్న దీపాల్ని తగ్గించారు.

''ఆంజనేయ స్వామిని గట్టిగా మనసులో తలచుకుని, చేతిలోకి తీక్షణంగా చూడు'' ఆదేశించారు వుపాసకుడు.

ఆయన చెప్పినట్టే చేశాను.

''ఏం కనబడుతోంది?'' వుపాసకుడు గంభరస్వరంతో అడిగారు.

అంజనం వేసిన చేతిలోకి చూశాను. ఏమీ కనబడలేదు.

''నాకేమీ కనబడ్డం లేదండీ! అంతా నల్లగా వుంది'' స్పష్టంగా చెప్పాను.

నిజం చెప్పె వుపాసకుడు ఏదో చేసి స్వామి కనబడేలా చేస్తారని నా ఆశ.

''మళ్లీ ఇంకొకసారి దేముడిని ప్రార్థించుకుని చూడు. ఏం కనబడుతోంది అంజనంలో?'' ఇంకా గట్టిగా అడిగారు వుపాసకుడు.

''ఏమీ కనబడటం లేదండీ!'' నెమ్మదిగా చెప్పాను.

వుపాసకుడు గట్టిగా ఏవో మంత్రాలుచ్చరించారు.

''ఈసారి చూడు జాగ్రత్తగా! ఆంజనేయస్వామి కనబడ్డం లేదూ అంజనంలో?'' గంభీరగా అడిగారువుపాసకుడు.

''లేదండీ!''నీరసంగా అన్నాను.

నేనొక పాపాత్ముడినని నాకు నిర్ధారణ అయిపోయింది.

అక్కడున్న జనాల్లో గుసగుసలు మొదలయ్యాయి.

''పొద్దున్నించీ నిష్ఠగా ఏమీ తినకండా వున్నావా నిజంగా?'' అనుమానంగా అడిగారు వుపాసకుడు.

''ఒట్టుగా పొద్దున్నించీ ఏమీ తినలేదండీ! కావలిస్తే మా అమ్మనడగండీ!'' ఏడుపొక్కటే తక్కువ నాకు.

''మరెక్కడ తప్పు జరిగింది? ఒక అయదు నిముషాల సేపు ఆంజనేయస్వామిని స్మరించుకొని, ఏకాగ్రతతో అంజనంలోకి చూడు'' ఆదేశించారు.

కళ్లు మూసుకుని ప్రార్తన మొదలుపెట్టాను.

''పిల్లాడు పొద్దున్నించే ఏమీ తినలేదు. నీరసంతో ఏకాగ్రత తప్పుతోందేమో!'' అంది అమ్మ అభిమానంగా.

''అంజనంలో ఆంజనేయ స్వామి కనబడాలంటే, ఎక్కువ భక్తి వుండాలేమో!''పక్కింటి ముసలావిడ అంది.

మిగిలిన వాళ్లు ఏవో గుస గుసగా అంటున్నారు.

దేముడిని ప్రార్థించుకుంటున్న నాకు ఆ మాటలన్నీ వినబడుతూనే వున్నాయి. నా కళ్లల్లో నీళ్లూరాయి. ఎడం చేత్తో తుడుచుకున్నాను.

''ఇప్పుడు కళ్లు తెరిచి, మరింత ఏకాగ్రతతో, భక్తితో అంజనంలోకి చూడు. ఏం కనబడుతుందో చెప్పు'' తీవ్రంగా అన్నారు వుపాసకుడు.

తడికళ్లతో చేతిలోకి చూశాను.

''సంజీవనీ పర్వతం మోస్తున్న ఆంజనేయ స్వామి కనబడుతున్నాడండీ!'' అన్నాను కొంచెం వణుకుతున్న గొంతుతో.

నాకెలాగూ చాలా పాపం వొచ్చేస్తుందని తెలిసిపోయింది.

అమ్మా, వుపాసకుడూ నిట్టూర్చారు. చుట్టూ వున్న వాళ్లల్లో చిన్న కలకలం. మొత్తానికి అందరి మొహాలు వికసించాయి.

''నే చెప్పలేదమ్మా? మంచి ఏకాగ్రత అవసరం ఈ అంజనానికి. మొత్తానికి మీవాడు మంచి భక్తుడే!''మెచ్చుకున్నారు వుపాసకుడు.

చిరునవ్వు మొలిచింది నా మొహాన.

''మరింత ఏకాగ్రతతో శ్రద్ధగా చూడు అంజనంలోకి. మీ బట్టలు పోయిన రాత్రి ఏం జరిగిందీ?'' అడిగారు వుపాసకుడు మరింత తీవ్ర స్వరంతో.

ఒక్కసారిగా బిర్రబిగుసుకుపోయాను. ఏమీ మాట్లాడలేదు.

వుపాసకుడు రెట్టించి అడిగారు మళ్లీ.

''ఆంజనేయస్వామి తప్ప ఇంకేమీ కనబడ్డం లేదండీ!'' నెమ్మదిగానే అయినా, స్పష్టంగా చెప్పాను.

పోయిన బట్టలు దొరకాలనే ఆశ చాలా వుంది.

''ఇంకొకసారి శ్రద్ధగా చూడు'' రెట్టించిన కంఠంతో అడిగారు.

నేను మళ్లీ అదే మాట చెప్పాను మొండిగా.

కుడిచేయి అంతసేపు ఎత్తి పట్టుకున్నందువల్ల నొప్పి పుడుతోంది. ఒకసారి కుడిచేయి కిందికి దించి, మళ్లీ పైకెత్తాను.

''పిల్లాడు అలిసిపోయాడండీ!'' అంది అమ్మ జాలిగా.

ఉపాసకుడు ఓ క్షణం ఆలోచించారు.

''మొన్న వేమూరి వాళ్లింట్లో ఇలా జరగలేదు. వాళ్లబ్బాయికి అన్నీ కనబడ్డాయి. ఆ అబ్బాయి ఆంజనేయస్వామి అంశన పుట్టాడు. వెళ్లి ఎవరన్నా ఆ అబ్బాయిని పిలుచుకురండి. తడి తువ్వాలు చుట్టుకుని రమ్మని చెప్పండి. నే చెప్పినట్టుగా చెప్పండి'' అన్నారు వుపాసకుడు.

బ్రతుకుజీవుడా అనుకున్నాను. ఇంక బట్టలు దొరకవేమో అనుకున్న నాకు దొరుకుతాయనే ఆశ మళ్లీ కలిగింది.

ఎవరో వెళ్లి వేమూరి వారబ్బాయి సత్యాన్ని తీసుకువచ్చారు. వాడు స్కూల్లో నాకన్నా ఒక క్లాసు తక్కువ. ఓ తడి తుండు గుడ్డ చుట్టుకుని వచ్చాడు.

''వీడు పొద్దున్నించీ నిష్టంగా వుపవాసం వుండేలేదు కదండీ?'' అని కంగారుగా వుపాసకుడిని అడుగుదామని కంఠంలోకి వచ్చిన మాటల్ని బలవంతంగా నొక్కేశాను.

ఆంజనేయుని అంశనపుట్టిన వాళ్లకి ఈ నియమాలుండవనిపించింది.

సత్యం నా కుడిచేతి అంజనంలో చూస్తూ వుపాసకుడు అడుగుతున్న ప్రశ్నలకు జవాబులు ఠకీ, ఠకీమని చెప్పేస్తున్నాడు.

బట్టలు పోయిన రాత్రి ఎవడో నల్లగా వున్నవాడు గోడ దుమికి వచ్చాడుట. వాడే బట్టలు ఇంట్లోంచి ఎత్తుకెళ్లాడుట. ఇంక అవి దొరకవుట.

అప్పటికే మా అమ్మకీ, నాకూ గుండెలు దిటవుగా అయిపోయాయి.

చుట్టపక్కల వాళ్లు ఏవేవో ప్రశ్నలు అడుగుతూ వుంటే, వాటిని వుపాసకుడు సత్యానికి చెప్పడం, వాడుచక, చకా జవాబులు చెప్పడం జరుగుతోంది.

అంతలో నాకింకో చిన్న ఆశ వచ్చింది.

''నాకు హిందీ రాష్ట్ర పరీక్షలో ఫస్ట్ క్లాసు వస్తుందేమో చూడు'' అని ఆశగా అడిగాను సత్యాన్ని.

''వస్తుంద''న్నాడు వాడు.

వాడిమీద చాలా ప్రేమ కలిగింది.

''మా అక్కకి కూడా హిందీ రాష్ట్ర పరీక్షలో ఫస్ట్ క్లాసు వస్తుందా?'' అక్క మీద ప్రేమతో అడిగాను.

అక్క కూడా అమ్మ బలవంతం మీద నాతో కలిసి అదే పరీక్ష రాసింది.

''రాదు. మీ అక్క మామూలుగా పాసవుతుంది'' అన్నాడు వాడు.

ఆ మాటలకే బోలెడు సంతోషం వేసింది.

హిందీ రాష్ట్ర భాష పరీక్షలో ఫస్ట్‌క్లాసు వస్తుందన్నాడని సంతోషంగానే వున్నా, చిలా దిగులుగా కూడా వుంది అంజనంలో ఆ విషయాలన్నీ కనబడనందకు. నేనెన్ని వుపవాసాలు చేసేనూ, ఎన్ని పూజలు చేసేనూ, ఎన్ని మొక్కులు మొక్కేనూ! ప్రతీ వారం గుడికి వెళుతూనే వున్నాను. స్కూలుకెళ్లే దారిలో ప్రతీ గుడి దగ్గరా ఆగి దణ్ణం పెట్టుకుంటూనే వున్నాను. హనుమాన్ చాలీసా, ఆదిత్య మంత్రం పారాయణం చేస్తూనే వున్నాను. అయినా అంజనంలో నాకేమీ కనబడలేదు. సత్యానికి మాత్రం ఎలా కనబడిందీ? వాడు ఆంజనేయ స్వామి అంశన పుడితే, నేను సూర్యుడి అంశన పుట్టానూ!

ఆ రోజు స్కూల్లో క్లాసురూంకి వెళుతూ వుంటే, పరుగున సత్యం నాదగ్గరకి వచ్చాడు.

ఏమిటన్నట్టు చూశాను.

''పొద్దున్న పెన్నులో ఇంకు పోసుకోవడం మర్చిపోయానురా! బాబ్బాబు, నీ పెన్నులో ఇంకు కాస్త నా పెన్నులో పోయరా!'' బతిమాలుతూ అడిగాడు.

పొద్దున్నే పెన్ను ఇంకోతో నింపాను.

''సరే'' నంటూ వాడి పెన్నులో కొంచెం ఇంకుపోశాను నా పెన్నులోంచి.

''బతికించావురా!'' అంటూ నావేపు ఆపేక్షగా చూశాడు వాడు.

ఛాన్సు దొరికిందనుకున్నాను.

''ఒరేయి సత్యం ఒకటడుగుతాను చెబుతావా?'' అననయంగా అడిగాడు.

''అడుగు''

ఏమడిగినా ఇచ్చేలా వున్నాడు.

అంజనంలో నాకు కనబడని విషయాలన్నీ నీకలా కనబడ్డాయిరా? నిజం చెప్పరా!'' ఆశగా అడిగాను అసలు. రహస్యం చెబుతాడని.

వాడు నావేపు అదోలా చూశాడు.

''కనబడకపోతే మనం పాపాత్ముల కిందే లెక్క. కఠిన వుపవాసం లేనట్టు అవుతుంది. ఎందుకు కనబడదూ? నువ్వు ఎక్కువ పాపాలు చేసుకునుంటావు. అందుకే నీకు కనబడలేదు. నేను కూడా పాపాలు చేసుకుని, అంజనంలోది చూడలేకపోతే, మానాన్న చంపేస్తాడు. నేను పాపాత్ముడిని కాను. నాకన్నీ కనబడతాయి'' అంటూ వాడి క్లాసు రూంకి వెళ్లిపోయాడు.

ఏదో విషయం అర్థం అయినట్టనిపించింది కాస్త. ఆ తతంగం జరిగిన కొన్ని రోజులకి హిందీ రాష్ట్ర భాష పరీక్షా ఫలితాలూ, మార్కులూ వచ్చాయి.

మా అక్క పరీక్ష ఫేయిలయింది. నేను బొటాబొటీ ముప్పై అయిదు మార్కులతో పాసయ్యాను.

ఫస్ట్‌క్లాసు వస్తుందనుకున్న నాకు గట్టి షాక్ తగిలింది. జరుగుతున్నవి అర్థం గాక, అయోమయంగా అనిపించింది.

ఆ యేడాది స్కూలు పరీక్షల్లో సత్యం ఆరవక్లాసు ఫెయిలయ్యాడు. నేనూ, మా అక్కా మా స్కూలు పరీక్షలు పేసయ్యాం.

ఈ అనుభవాలతో నాకు, జీవితంలో మొట్టమొదటిసారిగా వుపవాసాల మీదా, పూనకాల మీదా, అంజనాల మీదా, ప్రశ్నలడగం మీదా ప్రశ్నలు మొదలయ్యాయి!

★

తల్లి వేషాల్లో కుర్రనటి

ఇప్పుడు తల్లి క్యారెక్టర్లకు తెల్లజుత్తు వుండాల్సిన అవసరం లేదు. ఒకప్పటి మాట అది. తల్లి వేషాలు వేసే యాక్టర్లకు తలకు తెల్లరంగు వేసేవాళ్ళు. నికి అనేజా 'అస్తిత్వ' అనే సీరియల్‌లో తల్లివేషం వేస్తోంది. కానీ హెయిర్ స్టయిల్ ఏమాత్రం మార్చలేదు. మార్చాల్సిన అవసరమేముంది అని ప్రశ్నిస్తోంది. ''డెబ్బయి ఏళ్ళ ముసలమ్మ కూడా నల్లరంగేసుకుని నిగనిగలాడే తెల్లజుత్తుతో సొసైటీలో తిరుగుతున్నప్పుడు ఆ మార్పులు టీవీల్లో కూడా రానక్కరలేదా?'' అని ప్రశ్నిస్తోంది నికి.